క్లుప్తంగా

ఆంజనేయస్వామికి విశేష పూజలు



పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయస్వామికి అర్చకులు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, తిరిగి సాయంత్రం స్వామికి పూజలు, పల్లకిసేవ గావించారు.

ఎన్నికల నియమావళి తప్పక పాటించాలి



మాట్లాడుతున్న కోవూరు ఆర్వో, జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్

కోవూరు : ఎన్నికల నియమావళిని అన్ని రాజకీయ పార్టీల నాయకులు తప్పక పాటించాలని కోవూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ తెలిపారు. కోవూరులోని ఆర్వో కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో ప్రత్యేక సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనలను రాజకీయ పార్టీలు పూర్తిస్థాయిలో అవగాహన చేసుకుని సహకరించాలన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో ఫ్లయింగ్ స్క్వాడ్, ఎంసీసీ, స్వీప్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో ఎక్కువ మొత్తంలో నగదును తరలించరాదన్నారు. అదేవిధంగా రాజకీయ పార్టీల నాయకులు సభలు, ర్యాలీలతో పాటు ఎన్నికల ప్రచారం నిర్వహించాలంటే తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. ఈఆర్వో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.శ్రీనివాసులు, కోవూరు తహసీల్దార్ విజయశ్రీ, ఇందుకూరుపేట తహసీల్దార్ జి.రమేష్, బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ కమిషనర్ రమణబాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు కీలకం

కోవూరు : ప్రజాస్వామ్య దేశాల్లో ఓటు అత్యంత కీలకమని, దీనిని దృష్టిలో పెట్టుకుని యువత ఓటింగ్‌లో పాల్గొనాలని స్వీప్ నోడల్ ఆఫీసర్ పీవీ రత్నం పేర్కొన్నారు. కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ నేతాజీ నగర్‌లో ఉన్న వైకేఆర్ అండ్ కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఓటు హక్కు ఇతర అంశాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. అనంతరం ఓటుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీఎం ఎస్.రవిశంకర్‌రెడ్డి, సీఆర్పీ మల్లేశ్వర్‌రెడ్డి, సీసీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా

• ఇద్దరికి గాయాలు

వెంకటాచలం : ఆటో బోల్తా పడి ఇద్దరు వ్యక్తులు గాయపడిన ఘటన మండలంలోని కసుమూరు సమీపంలో మంగళవారం జరిగింది. నెల్లూరు నగరంలోని జాకీర్‌హుస్సేన్ నగర్ ప్రాంతానికి చెందిన కరిముల్లా, ఆసీఫ్ పని నిమిత్తం ఆటోలో కసుమూరుకు వచ్చారు. తిరిగి నెల్లూరుకు వెళ్తుండగా పాలిచెర్లపాడు మలుపురోడ్డు వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కరిముల్లా, ఆసీఫ్‌లకు స్వల్పగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

నేత్రదానం

నెల్లూరు(అర్బన్): దర్గామిట్టలోని పోలీస్ కాలనీకి చెందిన అద్దంకి సుధాకర్ (68) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. ఈ క్రమంలో ఆయన నేత్రాలను కుటుంబసభ్యుల అంగీకారంతో ప్రభుత్వ పెద్దాస్పత్రి ఐ డొనేషన్ కౌన్సెలర్ బాలాజీసింగ్, ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ లాలేష్ సేకరించారు. అనంతరం కుటుంబసభ్యులకు నేత్రదాన సర్టిఫికెట్‌ను అందజేశారు. నేత్రదానం చేసేందుకు 99481 64781, 93471 11033 నంబర్లను సంప్రదించాలని జిల్లా అంధత్వ నివారణాధికారి డాక్టర్ శర్వాణి కోరారు.

రథోత్సవ ఏర్పాట్లపై సమీక్ష

నెల్లూరు(బారకాసు): నగరంలో కొలువైన తల్పగిరి రంగనాథస్వామి రథోత్సవాన్ని పురస్కరించుకొని పారిశుధ్య పనులను ఎంహెచ్‌ఓ వెంకటరమణ మంగళవారం పర్యవేక్షించారు. దేవస్థానం వద్ద శానిటేషన్ అధికారులతో సమీక్షించిన అనంతరం ఆయన మాట్లాడారు. రథోత్సవానికి హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలను ప్రణాళికబద్ధంగా చేపట్టాలని సూచించారు. తాగునీటి సౌకర్యం, వీధుల్లో పరిశుభ్రత, వివిధ ప్రాంతాల్లో డస్ట్‌బిన్లను ఏర్పాటు చేయాలని సూచించారు. నిషేధిత ప్లాస్టిక్‌ను వినియోగించకుండా భక్తులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.

పంటలు మురిసే.. పశు సంపద మెరిసే

• వరిసాగు వల్ల అందుబాటులో గడ్డి
• పెరుగుతున్న పాల దిగుబడి
• పశువులకు లభ్యమవుతున్న పచ్చిగడ్డి

పొదలకూరు : పాల దిగుబడి గణనీయంగా పెరగడంతో పాడి రైతులు ఆర్థిక స్వావలంబన పొందుతున్నారు. మండల పరిధిలో 8 వేల ఎకరాల్లో వరిసాగు చేయడం వల్ల పశువుల మేతకు ఉపయోగించే ఎండుగడ్డి పుష్కలంగా లభ్యమవుతోంది. వర్షాలు సకాలంలో కురవకపోయినా మిచాంగ్ తుపాన్ ప్రభావం వల్ల చెరువులు, కుంటలు నిండి వరిసాగుకు అడ్డంకులు తొలగాయి. ఫలితంగా పాలదిగుబడి ప్రతి ఏడాది పెరుగుతున్నట్లుగా ఈ ఏడాది కూడా ఇబ్బందులు ఉండవని రైతులే వెల్లడించారు. ప్రతి రైతు రెండు గేదెలను పోషించుకుంటే కుటుంబం ఒడిదొడుకులు లేకుండా సాగిపోతుందనే ఉద్దేశంతో పాడిని నమ్ముకుని జీవిస్తున్నారు. గతంలో కరువు, కాటకాలతో గేదెలను అమ్ముకున్నారు. అంతేకాక వర్షపాతం గణనీయంగా తగ్గిపోవడంతో వాగులు, వంకలు, గుంటల్లో నీరు లభ్యం కాక పాడిపశువులు అల్లాడిపోయేవి. ఇప్పుడు వ్యవసాయం కన్నా పాడిపరిశ్రమే మేలని చాలా మంది రైతులు నమ్మి డెయిరీ ఫారమ్స్‌ను కూడా నిర్వహిస్తున్నారు. గడ్డి ఆశించిన స్థాయిలో లేకపోవడం వల్ల మోపు గడ్డి ధర రూ.150 నుంచి రూ.175 వరకు పలుకుతోంది. అలాగే ట్రాక్టర్‌తో గడ్డిని తోలుకోవాలంటే రూ.5 వేల వరకు రైతులు వెచ్చిస్తున్నారు. డెయిరీ ఫారమ్స్‌ను రైతులు ఏర్పాటు చేసుకునేందుకు బ్యాంకులు సైతం రుణాలు మంజూరు చేసేందుకు ముందుకు వస్తున్నాయి. ప్రభుత్వం అమూల్‌తో కలిసిన తర్వాత పొదుపు మహిళల నుంచే కాక పాడిరైతుల నుంచి పాలు వెల్లువెత్తుతున్నాయి.



డెయిరీ ఫారమ్‌లోని గేదెలు

పెరిగిన పాలవెల్లువ

మండలంలోని ప్రతి గ్రామంలో పాడిగేదెలు ఉన్నాయి. తాటిపర్తి, మహ్మదాపురం, సూరాయపాళెం, విరువూరు, నేదురుమల్లి, వెలికంటిపాళెం తదితర పెన్నార్ డెల్టా గ్రామాల్లో పాడిపరిశ్రమ అధికంగా ఉంది. ఇక్కడి గ్రామాల్లో నీటి లభ్యత బాగా ఉండడంతో రైతులు పాడిని నమ్ముకుని ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. మండలంలో 26 వేల గేదెలు, 2,500 తెల్లపశువులు(ఆవులు, ఎద్దులు) ఉన్నాయి. వీటిలో పాలు ఇచ్చే గేదెలు, ఆవులు సుమారు 10 వేల వరకు ఉన్నాయి. వీటి ద్వారా పాడిరైతులు ప్రతినిత్యం సుమారు 30 వేల లీటర్ల పాలను సేకరిస్తున్నారు. 20 వేల లీటర్ల పాలను ప్రభుత్వ(విజయ డెయిరీ), ప్రైవేటు డెయిరీలకు రైతులు పోస్తున్నారు. మిగిలిన 10 వేల లీటర్ల పాలను స్థానికంగా అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. తోడేరు పంచాయతీ పరిధిలో హెరిటేజ్, దుగ్గుంట పంచాయతీలో శ్రీనివాస డెయిరీ పాల శీతలీకరణ కేంద్రాలు ఉన్నాయి. పొదలకూరు పట్టణంలో కూడా ఇటీవల ఓ శీతలీకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.



ట్రాక్టర్లతో గడ్డిని తరలిస్తున్న పాడిరైతులు



రైతులు నిర్వహిస్తున్న డెయిరీ ఫారమ్‌లో ఆవులు

నేడు మంత్రి కాకాణి ఎన్నికల ప్రచారం

పొదలకూరు : రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి బుధవారం సాయంత్రం మండలంలోని మొగళ్లూరు, కనుపర్తి, నరసింహకండ్రిక, గురవాయపాళెం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి మంగళవారం తెలిపారు. ముందుగా మొగళ్లూరు గ్రామంలో నిర్వహించే ప్రచారంలో పాల్గొంటారని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొనాల్సిందిగా సూచించారు.

వైఎస్సార్‌సీపీలో చేరికలు



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో చలపతిరావు

కొడవలూరు : మండలంలోని దామేగుంట నాలుగో వార్డు సభ్యుడు ఏలూరు పోలయ్య టీడీపీని వీడి తన కుటుంబ సభ్యులతో మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ మేరకు దామేగుంటలో డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చలపతిరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని సంక్షేమ పాలనకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో వలసలు పెరుగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు చిమటా శేషగిరి, కొట్టి మల్లికార్జున, అనికేపల్లి వెంకటరత్నం, అరికొండ సుధాకర్ పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు జగనన్న రావాలి

• మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

తోటపల్లిగూడూరు : రాష్ట్రంలో సంక్షేమ పాలనకు జగనన్న రావాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని చింతోపు, ముంగలదొరువు, సౌత్‌ఆములూరు గ్రామాల్లో తిరుపతి ఎంపీ గురుమూర్తితో కలిసి మంత్రి కాకాణి మంగళవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో చంద్రబాబు వందల సంఖ్యలో హామీలిచ్చి ఏ ఒక్కటీ నెరవేర్చకుండా రాష్ట్ర ప్రజలను నిలువునా వంచించాడన్నారు. ఇలాంటి నమ్మకద్రోహి చంద్రబాబుకు మరో అవకాశం ఇస్తే రాష్ట్రాన్ని నట్టేట ముంచేస్తాడన్నారు. నాలుగు దఫాలు సర్వేపల్లి ప్రజల తిరస్కారానికి గురై అడ్డదారిన మంత్రి పదవి పొందిన సోమిరెడ్డి నాడు ప్రజా సంక్షేమాన్ని విస్మరించి అనేక అవినీతి అక్రమాలతో రూ.వందల కోట్లు దోచేశాడన్నారు. రాష్ట్రంలో పేదల అభ్యున్నతికి కృషి చేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. రాష్ట్రంలో మరోదఫా ప్రజారంజక పాలన రావాలంటే జగన్‌మోహన్‌రెడ్డికి పట్టం కట్టాలన్నారు. అలాగే సర్వేపల్లి నియోజకవర్గం నుంచి తనను ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులు ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు ఉప్పల శంకరయ్యగౌడ్, ఎంపీపీ ఉప్పల స్వర్ణలత, జెడ్పీటీసీ ఎంబేటి శేషమ్మ, వరిగొండ ఆలయ చైర్మన్ కోసూరు రవీంద్రయ్య, స్థానిక నాయకులు చెరుకూరు శ్రీనివాసులునాయుడు, మద్దెన సుబ్బానాయుడు, లేబూరు మల్లికార్జున్, కోనేటి రాజు, డి.సతీష్, చెరుకూరు సరళకుమారి, ప్రసాద్, ఉపేంద్ర, గూడూరు విష్ణుమోహన్‌రెడ్డి, కామిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, చింతంరెడ్డి దశరథరామిరెడ్డి, కోటా శేఖర్‌రెడ్డి, గండవరపు శ్యామలమ్మ, నెల్లిపూడి సునీల్‌రెడ్డి, ఒబ్బారెడ్డి సురేష్‌రెడ్డి, చిల్లకూరు ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.



మంత్రి కాకాణి, ఎంపీ గురుమూర్తికి హారతి ఇస్తున్న మహిళలు

జ్వాలాముఖి ఆలయాభివృద్ధికి కృషి

భక్తుల కొంగు బంగారం వరిగొండ జ్వాలాముఖి అమ్మవారి ఆలయాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. వరిగొండలోని జ్వాలాముఖి అమ్మవారి ఆలయంలో మంత్రి కాకాణి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయానికి విచ్చేసిన మంత్రి కాకాణికి ఆలయ చైర్మన్ కోసూరు రవీంద్రయ్యతో పాటు ఆలయ పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ క్రమంలో కాకాణి అమ్మవారికి సారె సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరిగొండ జ్వాలాముఖి ఆలయానికి ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ప్రజలకు అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరారు.



అమ్మవారికి సారె తీసుకెళ్తున్న మంత్రి కాకాణి

వేరుశనగ నూర్పిళ్లు ప్రారంభం

ముత్తుకూరు : ముత్తుకూరు మండలంలో రబీ సీజన్ కింద వేసిన వేరుశనగ పంట కోతలు ప్రారంభమైంది. పలు గ్రామాల్లో వ్యవసాయ కూలీలు, యంత్రాల ద్వారా నూర్పిళ్లు జరుగుతున్నాయి. ముత్తుకూరు, నారికేళ్లపల్లి, పంటపాళెం, ఈపూరు, దొరువులపాళెం, మామిడిపూడి, బ్రహ్మదేవి, పిడతాపోలూరు, నేలటూరు తదితర పంచాయతీల్లో ఈ సీజన్‌లో 520 ఎకరాల్లో శనగ సాగు చేశారు. ప్రస్తుతం నారికేళపల్లి, ముత్తుకూరు, పంటపాళెం, ఈపూరు పంచాయతీల్లో కోతలు ప్రారంభమయ్యాయి. శనగ నూర్పిళ్ల ఫలితంగా గ్రామాల్లో సందడి నెలకొంది. ఎకరాకు 35 నుంచి 40 కిలోల శనగ కాయలు దిగుబడి ఉంటోందని రైతులు చెబుతున్నారు. అయితే, కాయలు ఎండబెట్టుకునే దశలో ఉండడం వల్ల అమ్మకాలు ప్రారంభం కాలేదు.



వేరుశనగ కాయలను నూర్పిళ్లు చేస్తున్న కూలీలు

హోమియోలో అన్ని వ్యాధులకు చికిత్స

మనుబోలు : అన్నిరకాల వ్యాధులకు హోమియోలో చికిత్స ఉందని స్థానిక ప్రభుత్వ హోమియో డాక్టర్ శిరీష అన్నారు. మనుబోలు చంద్రమౌళినగర్ గిరిజన కాలనీలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పలువురు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించడంతో పాటు నివారణ మార్గాలు హోమియో వైద్యంలో ఉన్నాయన్నారు. బీపీ, షుగర్, పైల్స్ వంటి వాటికి వైద్యం అందించడంతో పాటు ఉచితంగా మందులు కూడా అందజేస్తామని తెలియజేశారు. ఈ వైద్య శిబిరంలో ల్యాబ్ టెక్నీషియన్ నజీమా, హోమియో వైద్య సిబ్బంది సుప్రియ, రాజన్, అంగన్‌వాడీ సుగుణమ్మ ఉన్నారు.



రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ శిరీష

సోమరాజుపల్లిలో పశు వైద్యశిబిరం

ఇందుకూరుపేట: పశుసంవర్ధక శాఖ, స్వర్ణభారతి ట్రస్ట్, మండవ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని సోమరాజుపల్లిలో మంగళవారం ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశు సంవర్ధక శాఖ ఏడీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో పశువులకు పరీక్షలు చేసి వాటికి సంబంధించిన మందులను పాడి రైతులకు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మైపాడు పశువైద్యాధికారి అస్లాం అత్తర్, మండవ ఫౌండేషన్ డాక్టర్ వి.శ్రీనివాసులు, ఎల్ఎస్ఏ రాజేశ్వరి, రైతు భరోసా పశువైద్య సహాయకులు శేఖర్, జగదీష్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



పాడి రైతుకు మందులు అందజేస్తున్న పశు వైద్యులు

పట్టువస్త్రాల సమర్పణ

నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని స్వామివారికి పట్టువస్త్రాలను టీటీడీ ఆధ్వర్యంలో మంగళవారం సమర్పించారు.

గ్రామ పంచాయితీ కార్యాలయం – మనుబోలు గ్రామం
మనుబోలు (మం) శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా

టెండరు ప్రకటన తేది : 26-03-2024

శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా, మనుబోలు మండలం, మనుబోలు గ్రామ పంచాయతీ నందు ఈ దిగువ తెలిపిన పనులు చేయుటకు ఆసక్తి గలవారి నుండి రోజు కూలీ రేటు టెండర్లు కోరడమైనది. సదరు టెండర్లు తేది.30-03-2024 మధ్యాహ్నం 3.00 గంటలలోపు దాఖలు చేయవలెను. అదే రోజు సాయంత్రం గం. 3.30 ని.లకు అప్పటికి హాజరైన టెండరు దారుల సమక్షములో టెండర్లు తెరవబడును. ఇతర వివరములు కార్యాలయం పని చేయు వేళలలో తెలుసుకొనవచ్చును.టెండర్లు స్వీకరించు తేది ప్రభుత్వముచే పబ్లిక్ సెలవు దినముగా ప్రకటించబడినచో మరుసటి దినమున టెండర్లు స్వీకరించబడును.

వ.నెం.	పని వివరములు	పోస్టుల సంఖ్య	కాలపరిమితి	చెల్లించవలసిన ధరావత్తు ఫీజు
1	కాంట్రాక్ట్ PWS ఆపరేటర్స్	8	01-04-2024నుండి 31-03-2025 వరకు	200/-
2	కాంట్రాక్ట్ స్వీపర్లు	9	01-04-2024నుండి 31-03-2025 వరకు	200/-
3	కాంట్రాక్ట్ డ్రైవర్	1	01-04-2024నుండి 31-03-2025 వరకు	200/-

సం//- పంచాయతీ కార్యదర్శి, గ్రామపంచాయితీ మనుబోలు గ్రామం, మనుబోలు

వైఎస్సార్‌సీపీతోనే పేదలకు మేలు



కొడవలూరు: నార్తురాజుపాళెం సీబీఎన్ కాలనీలో ఇంటింటి ప్రచారం చేస్తున్న చలపతిరావు తదితరులు



పొదలకూరు : ఎన్నికల ప్రచారం చేస్తున్న పూజిత

• డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు

కొడవలూరు: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉంటేనే పేదలకు ఎంతో మేలు చేకూరుతుందని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు స్పష్టం చేశారు. మండలంలోని నార్తురాజుపాళెం సీబీఎస్ కాలనీలో మంగళవారం సాయంత్రం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధనవంతులంతా ఒక్కటై వైఎస్సార్‌సీపీ ఓటమికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. పేదలకు ఎంతో చేసిన జగన్‌మోహన్‌రెడ్డిని మరలా ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత ఉందని గుర్తుచేశారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిలను అత్యధిక మెజారిటీతో గెలిపించుకుని పెత్తందార్లకు గుణపాఠం చెప్పాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గాలి జ్యోతి, సర్పంచ్ బి.సుప్రియ, సచివాలయాల మండల కన్వీనర్ కొండా శ్రీనివాసులురెడ్డి, నాయకులు జి.జనార్దన్‌రెడ్డి, కాకాని శ్రీనివాసులు, వేముల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నడూ లేని అభివృద్ధి

పొదలకూరు : పట్టణంలో ఎన్నడూ లేని అభివృద్ధి తన తండ్రి చేశారని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజిత పేర్కొన్నారు. పట్టణంలోని టైలర్స్‌కాలనీ, టీపీ నగర్, సంగంరోడ్డు సెంటర్లలో రెండో రోజు మంగళవారం ఆమె ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టైలర్స్‌కాలనీలో ఎన్నో ఏళ్లుగా 11 కేవీ విద్యుత్ తీగలు ఇళ్లపై వెళ్తుంటే రూ.లక్షలు వెచ్చించి సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. పట్టణ ప్రజలు ఆలోచించి ఓట్లు వేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి, జెడ్పీటీసీ తెనాలి నిర్మలమ్మ, ఎంపీటీసీలు షాకీరాబేగం, లక్ష్మీకల్యాణి, వార్డుసభ్యుడు అంజాద్, ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు దస్తగిరి, నాయకులు ఎం.శేఖర్‌బాబు, మద్దిరెడ్డి రమణారెడ్డి, జి.వేణుగోపాల్‌రెడ్డి, డి.విజయభాస్కర్‌రెడ్డి, భారతమ్మ, శ్రీనివాసులుగౌడ్, జిలానీ, జమీర్ పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

కోవూరు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని చూసి ఆశీర్వదించాలని ఆ పార్టీ నేత పొన్నపోలు సుధీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఇనమడుగు గ్రామంలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అన్నివర్గాల ప్రజలు సుభిక్షంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నేతలు గండవరపు వసంతకుమార్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, రామ్‌ప్రసాద్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి సొనగిరి జగన్, సర్పంచ్ ప్రమీలమ్మ తదితరరులు పాల్గొన్నారు.



కోవూరు : ఇనమడుగులో..

